క్లుప్తంగా

తృతీయ శ్రీరామసప్తాహాల ప్రారంభం



కరకుదురులో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

పెదపూడి: మండలంలోని కరకుదురు గ్రామంలో ఉన్న రామాలయంలో మంగళవారం తృతీయ శ్రీరామసప్తాహాలు ప్రారంభమయ్యాయి. ఆలయంలో స్వామి వారికి శ్రీరామ సంకీర్తనలు ఆలపించి భజనలు చేశారు. ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త వుండ్రు సత్యనారాయణ ఆధ్వర్యంలో గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ వారం రోజులు పాటు నిర్వహించే ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. చివరి రోజు భారీ అన్నదానం నిర్వహిస్తారన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం వద్ద మజ్జిగ అందిస్తున్న సాయికల్యాణ్

సీతానగరం: ఉగాది సందర్భంగా మిర్తిపాడు పంచాయతీలోని సూర్యారావుపేట వద్ద మాకిరెడ్డి అప్పారావు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు వైఎస్సార్‌సీపీ నాయకుడు, సచివాలయం కన్వీనర్ సాయికల్యాణ్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీటీసీ మాకిరెడ్డి దేవి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వాహనదారులకు, పాదచారులకు, ఆటో ప్రయాణికులకు మజ్జిగను పంపిణీ చేశారు. మూడేళ్ల నుంచి ప్రతి వేసవిలోను చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నామని సాయికల్యాణ్ చెప్పారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రతిరోజూ కూలింగ్ వాటర్‌ను అందిస్తామని తెలిపారు

మందుబాబుల ఘర్షణ

ఒకరికి తీవ్ర గాయాలు

సీతానగరం: మద్యం మత్తులో కొందరు మందుబాబులు ఘర్షణ పడిన ఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. రఘుదేవపురానికి చెందిన పసలపూడి రామకృష్ణ గ్రామంలోని బ్రాందీ షాపు వద్ద మద్యం సేవించి ఉన్నాడు. మద్యం మత్తులో ఉన్న అదే గ్రామానికి చెందిన కొందరు రామకృష్ణ వద్దకు వచ్చి మోటార్ సైకిల్‌ను అడ్డుతీయమని చెప్పారు. మోటార్ సైకిల్ ఎవరిదో తనకు తెలియదని రామకృష్ణ సమాధానమిచ్చాడు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అది కాస్తా ఘర్షణకు దారితీయడంతో.. రామకృష్ణ తలపై రాయితో దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన రామకృష్ణను అతడి కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. ఈ సంఘటనపై తమకు ఎటువంటి సమాచారం అందలేదని సీతానగరం పోలీసులు చెప్పారు.

భార్యాభర్తలపై వేర్వేరు కేసులు

సీతానగరం: మద్యం తాగొచ్చి భర్త వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు చేయగా, భర్తను, అత్తను భార్య, ఆమె తరపు బంధువులు కొట్టారంటూ వచ్చిన ఫిర్యాదులపై సీతానగరం పోలీసులు వేర్వేరు కేసులు నమోదు చేశారు. ఎస్సై రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పురుషోత్తపట్నానికి చెందిన ఉర్ల చిన్నారిని, ఆమె కొడుకు రాకేష్‌ను, కోడలు అఖిల, ఆమె తరపు బంధువులు దాడి చేశారు. ఇటుకతో కొట్టడంతో చిన్నారికి గాయాలయ్యాయి. ఆమె రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆస్పత్రి సమాచారం మేరకు అఖిలపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

ఇలాఉండగా అఖిల, రాకేష్‌లకు తొమ్మిదేళ్ల క్రితం వివాహం కాగా, మూడేళ్ల కుమార్తె ఉంది. మద్యం తాగొచ్చి భర్త తరచూ ఆమెను హింసిస్తున్నాడు. ఈ మేరకు అఖిల ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

కోడిపందేలు ఆడుతున్న ఆరుగురి అరెస్టు

సీతానగరం: రఘుదేవపురం, శ్రీరామనగరంల్లో మంగళవారం కోడిపందాలు నిర్వహిస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై టి.రామకృష్ణ కథనం ప్రకారం.. రఘుదేవపురం చింతాలమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో కోడిపందేలాడుతున్న నలుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.2,300, రెండు కోళ్లు, రెండు కత్తులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే రాపాక పంచాయతీలోని శ్రీరామనగరంలో కోడిపందేలు ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి, వారి నుంచి రూ.3,400, రెండు కోళ్లు, రెండు కత్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తామని ఎస్సై రామకృష్ణ తెలిపారు.

ఘటాభిషేకం

రాజమహేంద్రవరం రూరల్: పిడింగొయ్యి పంచాయతీ వెంకటగిరి-2లో ఆసిరమ్మ తల్లి అమ్మవారి ఘటాభిషేకం తనుబుద్ధి సూర్యభాస్కరరావు ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గ్రామంలోని ఆలయాలను ఊరేగింపుగా భక్తులతో దర్శించుకుని, అనంతరం గ్రామ ఆడపడుచులందరితో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు.

ప్రభవించిన ఉగాది ఉషస్సు

- క్రోధి నామ సంవత్సరానికి స్వాగతం పలికిన ప్రజలు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



బిక్కవోలులో శ్రీలక్ష్మీగణపతి స్వామిని దర్శించుకుంటున్న భక్తులు



గోగులమ్మ వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు



ప్రత్యేక అలంకరణలో వేంకటేశ్వరస్వామివారు

అనపర్తి: తెలుగు సంవత్సరాది ఉగాది పండగ సందర్భంగా మంగళవారం ఇంటింటా ఉగాది ఉషస్సు ప్రభవించింది. ఇంటింటా మామిడి తోరణాలు అలంకరించుకుని క్రోధి నామ సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు. ప్రజలంతా ఉదయాన్నే తలంటు స్నానాలు చేసి కొత్త బట్టలు ధరించి ఉగాది పండగను ఆనందంగా జరుపుకున్నారు. షడ్రుచుల సమ్మిళితంగా తయారుచేసిన ఉగాది పచ్చడిని ఆరగించి పరస్పరం ఉగాది శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉగాదిని పురస్కరించుకుని పలు ఆలయాల్లో దేవతామూర్తులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అభిషేకాలు జరిపారు. దర్శనానికి వచ్చిన భక్తులతో గ్రామదేవతల ఆలయాల్లో ఉదయం నుండి రద్దీ కనిపించింది. దీంతో గ్రామాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. దర్శనం అనంతరం ఆలయాల వద్ద భక్తులకు ఉగాది పచ్చడిని ప్రసాదంగా అందజేశారు. స్థానిక వీరుళ్లమ్మ అమ్మవారు, శాంతిపురంలోని గణపతి, సరస్వతీ సహిత మహాలక్ష్మీదేవి ఆలయం, పాతవూరు బాపనమ్మవారి ఆలయం, ఉమారామలింగేశ్వరస్వామి ఆలయం, కెనాల్ రోడ్డులోని వేంకటేశ్వర స్వామి, అభయాంజనేయస్వామి, అయ్యప్ప స్వామివారి ఆలయాల్లో దేవతామూర్తులకు విశేష పూజలు గావించారు. ఉగాది సందర్భంగా గ్రామాల్లోని వివిధ ప్రాంతాల్లో పండితులు పంచాంగ పఠనం గావించారు. స్థానిక ఐఎల్‌టీడీ సాయిబాబా గుడి కల్యాణ మండపంలో గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పండితులు నాగదేవర బాలాజీ శర్మ, స్థానిక పాతవూరు ఉమారామలింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో పండితులు రెడ్డి సురేష్‌శర్మ పంచాంగం పఠనం చేశారు. ఈ సందర్భంగా పండితులు గోచార ఫలాలు వివరిస్తూ 27 నక్షత్రాలకు సంబంధించిన జాతక, రాశి ఫలాలను వివరించారు.

వేంకటేశ్వరునికి చందనోత్సవం



పంచాంగ పఠనం చేస్తున్న నాగదేవర బాలాజీశర్మ



బలభద్రపురంలో పంచాంగ పఠనం చేస్తున్న పండితులు

పెదపూడి: క్రోధి నామ సంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా సంపర గ్రామంలోని ప్రసిద్ధి చెందిన ప్రాచీన వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి చందనోత్సవం నిర్వహించారు. స్వామి వారిని చందనం, డ్రైఫ్రూట్స్‌తో ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఉగాదిని పురస్కరించుకుని పండితులు ఖండవిల్లి హనుమంతాచార్యులు పంచాంగ పఠనం చేశారు. ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.

కిటకిటలాడిన లక్ష్మీగణపతి ఆలయం

బిక్కవోలు: క్రోధి నామ సంవత్సరం ఉగాది సందర్భంగా బిక్కవోలు ప్రాచీన శ్రీలక్ష్మీగణపతి స్వామివారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. దూరప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామిని దర్శించుకున్నారు. అలాగే శ్రీగోలింగేశ్వర స్వామివారి ఆలయం, కొంకుదురు బుడతల మామిడి వద్ద త్రిముఖలింగేశ్వరుని ఆలయం, పందలపాక శ్రీగౌరిశంకర, కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మండలంలోని ఊలపల్లి దుర్గమ్మ తల్లి ఆలయం వద్ద ఉగాది పురస్కరించుకుని మంగళవారం ఏకాహం నిర్వహించారు.

సత్యసాయి మందిరంలో ఉగాది వేడుక

రంగంపేట: స్థానిక సత్యసాయి సమాజ సేవా కేంద్రంలో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాల వికాస్ విద్యార్థులు బాబా చిత్రపటానికి, దివ్య పాదుకలకు సహస్ర నామార్చన చేశారు. జిల్లా విద్యా విభాగ సమన్వయకర్త ఎల్.శ్రీనివాసరాజు ఉగాది విశిష్టతను తెలియజేశారు. అనంతరం ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో సేవాదళ సభ్యులు నేతి సత్యనారాయణ, చిరట్ల రంగమాంగ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు

సీతానగరం: క్రోధి నామ సంవత్సర వేడుకలు మండల ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. మంగళవారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వివిధ గ్రామాల్లోని రామాలయాలు, శివాలయాలు, విష్ణాలయాల వద్ద అర్చకులు, పండితులు పంచాంగ పఠనం నిర్వహించారు. సీతానగరంలోని సీతారామాలయం, ఉమా రామలింగేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామివార్లను భక్తులు దర్శించారు. ముగ్గళ్ల శివాలయంలో ఉమా కొమరేశ్వర స్వామి, వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు అభిషేకాలు జరిపారు. అలాగే రఘుదేవపురం, కాటవరం, మునికూడలి, కూనవరం శివాలయాల్లోను, జాలిమూడిలో లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు.

ఉగాది సందర్భంగా అన్నదానం

పెదపూడి: జి.మామిడాడ శివారు లక్ష్మీనరసాపురంలో ప్రసిద్ధి చెందిన శ్రీ గోగులమ్మ అమ్మవారి ఆలయం వద్ద మంగళవారం క్రోధినామ సంవత్సర ఉగాది సందర్భంగా సుమారు 9 వేల మందికి అన్నదానం నిర్వహించారు. అమ్మవారిని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉగాది పురస్కరించుకుని ఇంత పెద్ద ఎత్తున అన్నదానం నిర్వహించడం అభినందనీయమని కమిటీ ప్రతినిధులు, గ్రామ పెద్దలను అభినందించారు. గోగులమ్మ అమ్మవారి ఆలయ అభివృద్ధికి దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ లంక మున్ని, ఉప సర్పంచ్ మేడపాటి తాతారెడ్డి, సొసైటీ చైర్మన్ సబ్బెళ్ల అమ్మిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేత చింతా దొరబాబు, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి వెంకటపద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి అండగా నిలవాలి

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



'జగనన్నా మళ్లీ నువ్వే రావాలన్నా' కరపత్రాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: నిరుపేదల అభ్యున్నతి, వారి సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగించిన సంక్షేమ సారథి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతిఒక్కరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. సంచార జాతులకు చెందిన పలు కుటుంబాలు మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ×మా సంచార జాతుల జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం జగనన్నా...మళ్లీ నువ్వే రావాలన్నా× పేరిట రూపొందించిన కరపత్రాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగనన్న ఆధ్వర్యంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక భరోసా కలిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎంను చేసుకుంటే ప్రజలకు మరింత సంక్షేమ లబ్ధి చేకూరుతుందన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా పేదరికమే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అమలుచేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమ యజ్ఞం నిరంతరాయంగా కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత సంచార జాతుల సంక్షేమానికి, వారి అభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను సంచార జాతుల ప్రతినిధులు ఎమ్మెల్యేకు వివరించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి తమ వంతు కృషి చేస్తామని ఎమ్మెల్యేకు హామీ ఇచ్చారు.

జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూడండి

ఎన్నికల ప్రచారంలో జక్కంపూడి గణేష్ సతీమణి సుకీర్తి



జి.యర్రంపాలెంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న గణేష్ భార్య జక్కంపూడి సుకీర్తి

రాజానగరం: గడచిన ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నుంచి పొందిన సంక్షేమ ఫలాలను, ఈ ప్రాంతంలో జరిగిన అభివృద్ధిని చూసి జగనన్న ప్రభుత్వానికి మరొక అవకాశమివ్వాలని ఉభయ గోదావరి జిల్లాల పార్టీ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ సతీమణి సుకీర్తి ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని జి.యర్రంపాలెంలో స్థానిక పార్టీ నాయకులతో కలిసి మంగళవారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి, పేదల సంక్షేమానికి అహర్నిశలు పాటుపడే జగనన్న ప్రభుత్వానికి వారి ఆశీస్సులు అందించాలని కోరారు. ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లు వేసి, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

మావుళ్లమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే రాజా



మావుళ్లమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే రాజా తదితరులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం గ్రామ దేవత మావుళ్లమ్మ అమ్మవారికి రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం ఉగాది పర్వదినం సందర్భంగా మావుళ్లమ్మ అమ్మవారి సంబరం సోమవారం రాత్రి నిర్వహించారు. అనంతరం ఉగాది సందర్భంగా అమ్మవారికి గ్రామంలో సుమారు 350 మంది మహిళలు 108 వంటకాలతో సారె, చీరలతో భారీగా ఊరేగించిన అనంతరం అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మావుళ్లమ్మ అమ్మవారితో పాటు, సింగవరంలోని కనకదుర్గ అమ్మవారిని, రామాలయాలను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్త తెలుగు సంత్సరంలో ప్రతిఒక్కరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్టు ఎమ్మెల్యే రాజా తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ మట్ట వసంతరావు, మండల యూత్ అధ్యక్షుడు కోలా శ్రీను, ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, మట్ట శ్రీను, కాండ్రు వీరన్న, మట్ట కాపు, వలవల వల్లీ, మద్దాల కొండలరావు, మట్ట మునియ్య తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు 'సహకారం'

- రూ.3 కోట్లతో సొసైటీ భవనాల అభివృద్ధి
- గత పాలకుల నిర్లక్ష్యానికి గురైన సంఘాలు
- ఎమ్మెల్యే రాజా చొరవతో బలోపేతం



రాపాకలో నూతనంగా నిర్మించిన సొసైటీ భవనం

రాజానగరం: సాగులో రైతులకు వెన్నుదన్నుగా నిలిచి, వారి ప్రగతికి అవసరమైన చేయూతనందించాలనే ఆశయంతో సహకార పరపతి సంఘాలు(సొసైటీ)లను ఏర్పాటుచేశారు. అన్నదాతలకు వ్యవసాయానికి అవసరమైన ఆర్థిక సహకారాన్ని అందించడంతో పాటు, సాగుకు కావలసిన ఎరువులు, పురుగు మందులు తదితర వాటిని కూడా ఈ సహకార సంఘాల ద్వారా అందజేస్తుంటారు. ఒకరకంగా చెప్పాలంటే ఆయా సహకార సంఘాల ద్వారా ఆర్థిక సహకారాన్ని అందుకునే రైతులు వాటి ప్రగతిలో భాగస్వాములుగా ఉంటారు. ఆయా సహకార సంఘాల పాలకవర్గాలను ఎన్నుకోవడంలో వీరే ఓటర్లు. సమర్థులైన పాలకులను ఎన్నుకోవడంలో విజ్ఞతను చూపిస్తారు. సహకార సంఘాల ప్రగతి అందులో ఉండే సభ్యుల పైనే ఆధారపడి ఉంటుంది. అటువంటి సహకార సంఘాలను గత పాలకులు నిర్లక్ష్యం చేయడంతో అనేక సహకార సంఘాలకు సొంత భవనాలు కూడా లేక, ఉన్నచోట పట్టిష్టంగా లేక శిథిలావస్థకు చేరువై, సమస్యలతో నడుస్తున్నాయి. ఈ తరుణంలో రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇటువంటి వాటికి మోక్షం వచ్చిందనే చెప్పాలి. ముఖ్యంగా నియోజకవర్గంలో రైతాంగానికి సాగులో వివిధ రకాలుగా సేవలందించే సహకార సంఘాలకు పక్కా భవనాలను కల్పించాలనే ఆశయంతో స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా ప్రత్యేక శ్రద్ధను చూపారు. రైతుల ప్రగతికి తోడ్పడే సహకార సంఘాలకు సంబంధించిన సమస్యలను తెలుసుకోవడంతో పాటు, అవసరమైన చోట పక్కా భవనాలు నిర్మించేలా కార్యాచరణను రూపొందించారు.

నాణ్యతతో భవనాలు

నియోజకవర్గంలో సీతానగరం, కోరుకొండ, రాజానగరం మండలాల్లో సహకార సంఘాలకు శాశ్వత భవనాలకు సుమారు రూ.3 కోట్ల నిధులు మంజూరు చేయించి, భవన నిర్మాణాలు నాణ్యతతో జరిగేలా ఎమ్మెల్యే జక్కంపూడి రాజా చర్యలు తీసుకున్నారు. దీంతో సీతానగరం మండలంలో సీతానగరం సొసైటీ భవనానికి రూ.48 లక్షలు, రాపాకలోని సొసైటీ భవనానికి రూ.46 లక్షలు, వంగలపూడిలోని సొసైటీ భవనానికి రూ.40 లక్షలు నిధులు కేటాయించి, పటిష్టమైన భవనాలు నిర్మించారు. అలాగే కోరుకొండ మండలం, శ్రీరంగపట్నం సొసైటీ భవనానికి రూ.54 లక్షలు, రాజానగరం మండలం దివాన్‌చెరువు సొసైటీ భవనానికి రూ.50 లక్షలు, కానవరం సొసైటీ భవనానికి రూ.72 లక్షలు వ్యయం చేసి, రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చారు.

సాగు రుణానికి ఇబ్బంది పడలేదు



సొసైటీ ద్వారా వ్యవసాయానికి అవసరమైన రుణాన్ని తీసుకోవడం, పంట పండిన తరువాత ఆ రుణాన్ని తీర్చి, మరో పంటకు కొత్త రుణాన్ని తీసుకోవడం తరచుగా చేస్తున్నాను. దీని వల్ల సాగుకు అవసరమైన పెట్టుబడులకు పెద్దగా అవస్థలు పడకుండా సాయం అందుతోంది. ఈ విధంగా సొసైటీలో సభ్యునిగా ఉండటం వల్ల ఏటా డివిడెండ్‌ని కూడా అందుకోగలుగుతున్నాను.

– చొల్లంగి శ్రీను, రైతు, తూర్పుగానుగూడెం, రాజానగరం మండలం

అభివృద్ధికి ఆదర్శంగా నిలిచారు



నియోజకవర్గంలో ప్రస్తుత ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గతంలో ఏ ఎమ్మెల్యే చేయని రీతిలో అభివృద్ధి పనులు చేపట్టి ఆదర్శంగా నిలిచారు. ముఖ్యంగా రైతాంగానికి అవసరమైన సహకార సంఘాలకు శాశ్వత భవనాలను నిర్మించడంలో అవసరమైన నిధులు మంజూరు చేయించి, తోర్పాటునిచ్చారు.

– గంగిశెట్టి సోమేశ్వరరావు, చైర్‌పర్సన్, దివాన్‌చెరువు సొసైటీ

బాపనమ్మతల్లికి హరిద్రాభిషేకం



హరిద్రాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు



అమ్మవారికి హరిద్రాభిషేకం నిర్వహించేందుకు హాజరైన మహిళలు

అనపర్తి: స్థానిక పాతవూరులో వేంచేసివున్న అనపర్తి గ్రామదేవత బాపనమ్మ అమ్మవారి మూలవిరాట్‌కు మంగళవారం హరిద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 23న ప్రారంభం కానున్న అమ్మవారి జాతర, తీర్థ కార్యక్రమాలను పురస్కరించుకుని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపి హరిద్రాభిషేకం గావించారు. గ్రామానికి చెందిన వందలాదిమంది ముత్తైదువులు మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్థానిక నల్ల కాలువ వద్దకు చేరి బిందెలతో గోదావరి జలాలను తీసుకొచ్చి అమ్మవారికి హరిద్రాభిషేకం చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహిళలకు పసుపు కుంకుమలు, జాకెట్టు, గాజులు అందజేశారు. ఈ నెల 23వ తేదీ రాత్రి అమ్మవారి జాతర, 24, 25 తేదీల్లో తీర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌సీఆర్ మురళీ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కర్రి ధర్మారెడ్డి, వ్యాపారవేత్త కర్రి సూర్యప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలంతా వైఎస్సార్ సీపీ వైపే..



సింగవరం, వంగలపూడికి చెందిన ఇతర పార్టీల వారిని వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే రాజా

సీతానగరం: సంక్షేమ పాలనతో రాష్ట్ర ప్రజలంతా వైఎస్సార్ సీపీ వైపే ఉన్నారని, ప్రతిపక్ష పార్టీలన్నీ ఖాళీ అవుతున్నాయని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. మంగళవారం సింగవరం, వంగలపూడి గ్రామాల్లో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సుడిగాలి పర్యటన చేశారు. గ్రామాల్లోని నాయకులు, కార్యకర్తలను కలుసుకొని వైఎస్సార్ సీపీ గెలుపులో భాగస్వాములవ్వాలని కోరారు. ఇరు గ్రామాలకు చెందిన టీడీపీకి చెందిన ముస్లిం పెద్దలు, ఇతరులు మొత్తం 30 మంది ఎమ్మెల్యే రాజా సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో వినూత్న పాలనకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారన్నారు. ఏ సర్వే చూసినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగిస్తున్నట్టే చెబుతున్నాయన్నారు. రాజానగరం నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో వైఎస్సార్ సీపీకి ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని చెప్పారు. అందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలే కారణమన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమంతో ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా వైఎస్సార్ సీపీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ఎన్నికల్లో ప్రతిఒక్కరూ పార్టీకి అత్యధిక మెజార్టీ తేవడానికి కృషి చేయాలని కోరారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, పార్టీ మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు పెదపాటి డాక్టర్‌బాబు, ఎంపీటీసీ కొమ్మిరిశెట్టి వెంకటేశ్వరరావు, నాయకులు చల్లమళ్ల సుజీరాజు, కొంచ భాస్కర్, అంబటి రమణ, అంబటి రాజు, చిర్ల పోశియ్య, మట్ట శ్రీనివాస్, పరిమి వీరన్న, శ్రీను, పేరిచర్ల శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది మంది పందెంరాయుళ్ల అరెస్టు

రంగంపేట: కోడి పందేలపై దాడి చేసినట్టు ఎస్ఐ పి.విజయ్‌కుమార్ తెలిపారు. మంగళవారం రాత్రి ఆయన తెలిపిన వివరాలు ప్రకారం మండల పరిధిలోని వడిశలేరు గ్రామ శివారు పొలాల్లో కోడి పందేలు నిర్వహిస్తున్నట్టు సమాచారం అందడంతో తమ సిబ్బందితో దాడి చేశామన్నారు. ఈ దాడిలో పందేలు ఆడుతున్న ఎనిమిది మందిని పట్టుకుని అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి రెండు కోడి పుంజులు, రెండు కోడి కత్తులు, రూ.2,290 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.